నేడు బీసీ విద్యార్థుల ర్యాలీ

కాచిగూడ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పుర చౌరస్తా వద్ద విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

రేపు గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాచిగూడ: గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 23న సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ డి.కోమురయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ జి.విజయ రామారావు, గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, డాక్టర్ దేవరాజు, డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ శేఖర్ తదితర ప్రముఖులు హాజరవుతారని వారు తెలిపారు.

నీట్ పేపర్ లీక్‌లో ఎన్‌డీఏ నేతల హస్తం

కాచిగూడ: నీట్ పేపర్ లీకేజీలో ఎన్‌డీఏ నేతల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని జనతాదళ్ (సెక్యులర్) తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మూలంగా 24 లక్షల కుటుంబాలు తీవ్ర అవేదనలో ఉన్నాయన్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగులు తీసుకొని పరీక్షలు రాస్తే చివరి నిమిషంలో పేపర్ లీకేజీ, కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు.

'చేపలమార్కెట్‌లో రోడ్లు అధ్వానం'



గోతులమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న పూసగోరఖ్‌నాథ్

ముషీరాబాద్: ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో అధ్వానంగా మారిన రోడ్డును అధునీకరించాలని డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పూసగోరక్‌నాథ్ జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. గుంతలమయంగా మారిన రోడ్డులో మురికి నీరు నిలిచిపోవడం వల్ల వ్యాపారులు, కోనుగోలు దారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వెంటనే రోడ్డుకు ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలందరికీ అందే విధంగా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ రఘు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: శ్మశాన వాటికలో చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేటలోని మొయిన్ చెరువు శ్మశాన వాటికలో రూ. 2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణ పనులను ఆమె, అధికారులు, శ్మశాన వాటిక కమిటీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. చేపట్టిన నిర్మాణాన్ని సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు శ్రీహరి, బాలరామ్, కృష్ణయాదవ్, తదితరులు ఉన్నారు.

కిషన్‌రెడ్డి నేతృత్వంలో మరింత అభివృద్ధి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న గీతా మూర్తి, బీజేపీ ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి నర్సింగ్ రావు

కాచిగూడ: కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం బర్కత్‌పురలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా మోర్చ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా యోగా..

పీపుల్స్ పార్క్‌లో యోగాడేలో పాల్గొన్న కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్



ముషీరాబాద్‌లో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్



కాచిగూడలోని యూపీహెచ్‌సీలో..




అంబేద్కర్ కళాశాలలో..


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


సెయింట్ ఆడమ్స్ పాఠశాలలో..

అంతర్జాతీయ యోగా డే వేడుకలు అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలనీ అసోసియేషన్లు, యోగా సెంటర్లు, వాకర్స్ అసోసియేషన్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి యోగాసనాలను పదర్శించారు. యోగ నిపుణుల సమక్షంలో సాధకులు పలు రకాల యోగాసనాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. పలుచోట్ల జరిగిన యోగా డే ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు హాజరై యోగా విశిష్టతపై ప్రసంగించారు.

ఉన్నత లక్ష్యంతో విద్యాభ్యాసం చేయాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యభ్యాసం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. శుక్రవారం అంబర్‌పేట లకోశియా ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందించి భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి వ్యక్తికి పాఠశాల విద్య పునాది వంటింది అని దాని ప్రాధాన్యతను విస్మరించరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు సుశీల, ఉపాధ్యాయలు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సదస్సులో మాట్లాడుతున్న వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్యాసం జీవనాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇస్తామన్న 12 శాతం రిజర్వేషన్ హామీని నిలబెట్టుకోవడంతో పాటు ఉన్న 10 శాతం రిజర్వేషన్‌ను కాపాడాలని సేవాలాల్ సేనా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్యాసంజీవనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అడ్‌హక్ కమిటీతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. అనంతరం భూక్యాసంజీవనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 3 స్థానంలో మరో జీవోను ఇచ్చి ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కన్వీనర్ మాలోత్ సైదా నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ మహారాజ్, గ్రేటర్ అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, పాల్గొన్నారు.

అసెంబ్లీ హాల్‌లో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న మదన్‌మోహన్ తదితరులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అసెంబ్లీ హాల్, ధర్నా చౌక్ వద్ద 121 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్‌మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ మనుమయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. అనంతరం వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి విష్ణు, కార్యదర్శి కొండాచారి, గ్రేటర్ హైదరాబాద్ మనుమయ సంఘం అధ్యక్షుల ఆశోక్‌చారి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు జి.ఎస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.జయశంకర్‌కు ఎమ్మెల్యే నివాళి

చిక్కడపల్లి: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అశోక్‌కుమార్ ప్రధాన రోడ్డులో ఉన్న జయంశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షలకు అనుగుణంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనను కొనసాగించిదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, సీనియర్ నాయకులు ముఠానరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.


అశోక్‌నగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠాజైసింహ, రాకేష్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చిక్కడపల్లి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో జవహర్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ అమరం మహేష్(42), కేబుల్ వ్యాపారి, బాగ్‌లింగంపల్లి అచ్చయ్యనగర్‌కు చెందిన విద్యార్థి ఎం.అశిష్(25) కుటుంబసభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ సీతయ్య మాట్లాడుతూ సంఘ విద్రోహుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎస్ఐలు అభిలాష్ , మౌనికలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

అంబర్‌పేట: సరిగ్గా నంబర్ ప్లేటు లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్ పై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అలాగే మైనర్లు వాహనాలతో తిరుగుతున్నవారిని గుర్తించి పట్టుకున్నారు. పది మందికి పైగా వాహనాదారులను పట్టుకొని అంబర్‌పేట లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించామన్నారు. పట్టుకున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలి



ముషీరాబాద్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, జీతాలు పెంచాలని ప్రజాభవన్‌లో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12769 గ్రామ పంచాయతీలో పని చేస్తున్న 60 వేల మంది కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని గత ఏడు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని ప్రజాభవన్‌లో ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ పెరిగిన ధరలు కనుగుణంగా గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు జీవో నెంబర్ 60 ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు.

యువతి స్నానం చేస్తుండగా వీడియో తీసిన వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: బాత్‌రూమ్‌లో ఓ యువతి స్నానం చేస్తుండగా దొంగచాటుగా వీడియో తీసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న 25 ఏళ్ల యువతి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా అదే ప్రాంతానికిచెందిన జెల్‌ఫేస్ (24) దొంగచాటుగా వీడియో తీస్తున్నాడు. అది గమనించిన యువతి అతనితో గొడవపడి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

కాచిగూడ: పెళ్లి చేసుకుంటానని మోసం చేసి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ప్రైవేట్ ఉద్యోగిపై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన యువతిని లక్డీకాపూల్‌లో నివాసం ఉంటున్న విశాల్ (27) ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి కాచిగూడలోని ఓ లాడ్జిలో అమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తిరిగి వేరొక యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో ఆ యువతి కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విశాల్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రులకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్‌ను కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శ్రీ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షులు గిరియాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరి యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు వెయ్యి మంది సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరిల్లో జిల్లా మేనేజర్, టీమ్ లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్య మిత్రులుగా 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియర్ గౌరవ అధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాన్ని 35 వేల రూపాయలు, టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పటేల్‌నగర్ నాలా సమస్యను పరిష్కరించాలి


డీఎంసీకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బీజేపీ నేతలు జీహెచ్‌ఎంసీ సర్కిల్16 డీఎంసీ మారుతీ దివాకర్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి ఏళ్ల తరబడి నాలా సమస్యతో డివిజన్‌లోని పటేల్ నగర్, ప్రేమ్‌నగర్, న్యూ ప్రేమనగర్, అహ్మద్‌నగర్, ఓవైసీ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేపట్టిన నాలా నిర్మాణం కూడా ప్రణాళిక లేకుండా చేపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు శ్యాంరాజ్, యాదగిరి, మైలరాం రాజు, భాస్కర్‌గౌడ్, మనోజ్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు సిద్ధం కండి

ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షులు వెంకటేశ్వరరావు


సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముషీరాబాద్: సింగరేణితో సహా కోల్ ఇండియా పరిరక్షణకు సిద్ధం కావాలని గని కార్మిక వర్గానికి ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షులు, గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 23న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ తరపున పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 60 బ్లాకులను ప్రైవేటీకరించడానికిని కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. అందులో భాగంగానే సింగరేణిలో నాలుగు బ్లాకులను ప్రైవేటీకరించడానికి పాలకులు పూనుకున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.అనురాధ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివబాబు, జిల్లా నాయకులు యాదయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సంజీవకుమార్ దాస్

ముషీరాబాద్: మహిళా సాధికారతతోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని జాతీయ స్థాయి జార్జ్ టెలిగ్రాఫ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవకుమార్ దాస్ పేర్కొన్నారు. స్కిల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రామ్‌నగర్‌లోని సాధన పారా మెడికల్ కళాశాల సౌజన్యంతో సాధన పారామెడికల్ కళాశాల చెందిన 50 మంది విద్యార్థులకు పేషెంట్ రిలేషన్‌షిప్ అంశంపై శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం రాంనగర్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సాధన కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ అసిఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి జార్జ్ టెలిగ్రాఫ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ దాస్, లిండే ఆక్సిజన్ సంస్థ ప్రాజెక్టు ఇన్‌చార్జి అనురాధాలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లోబలైజేషన్, వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.